


## ముంగిట మృత్యువు.

**నేను కాలక్షేపం** నవలలనే రాస్తానని కొన్ని వర్గాలు వారు 1980లలో నా మీద కమర్షియల్ రైటర్ అనే ముద్రవేసారు. కానీ నేను కేవలం వినోదం కోసమే కాకుండా రాజకీయ స్పృహతో రాసిన మూడో నవల 'ముంగిట మృత్యువు'. మొదటిది మయూరి వారపత్రికలో రాసిన సీరియల్ 'మాట్లాడే బొమ్మ'. దాన్ని గతంలో ఇదే శీర్షికలో మీకు పరిచయం చేసాను. మరొకటి 'సారీ రాంగ్ నంబర్'. పాఠకుల చేత ఉత్కంఠగా చదివించడానికి అవసరమైన దినుసులు నవల ఇతివృత్తాన్ని బట్టి మారుతూంటాయి.




సుప్రభాతం పక్షపత్రికలో 'జాబిలి మీద సంతకం' తర్వాత మరో సీరియల్ రాయమని దాని యజమాని రత్తయ్యగారు బషీర్‌బాగ్‌లోని వారి ఆఫీస్‌లో కోరారు. ఎబికె గారికి థీమ్ చెపితే వారికి అది నచ్చింది. ఆ సమయంలో ఇండియా ప్రధానమంత్రి వాజ్‌పాయ్. జులై 1993లో సెక్యూరిటీస్ స్కామ్‌లో ఆ నాటి ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు నివాసానికి హర్షద్ మెహతా బ్రీఫ్‌కేస్‌లో కోటిరూపాయల నోట్ల కట్టలని తీసుకెళ్ళాడనే బలమైన ఆరోపణ వినిపించింది. పి.విలాంటి ప్రధాని మీద కోర్ట్‌లో కేసు నిలబడని బలమైన న్యాయవ్యవస్థ మనది. ఆ పదవిలోని వారి రాజకీయ అవినీతి మీద నవల రాయాలని అది స్ఫూర్తిని ఇచ్చింది. 1996లో నేను కథని తయారు చేసుకున్నాను. నవల్లోని భయంకర సంఘటనలకి అనుగుణంగా అప్పటికే 'ముంగిట మృత్యువు' అనే పేరు కూడా నిర్ణయించుకున్నాను. కానీ తృప్తికరమైన ముగింపు దొరకడానికి రెండేళ్ళు పట్టింది.

అనేకసార్లు ఈ శీర్షికలో నేను ప్రస్తావించినట్లుగా అమెరికా నించి వెలువడే వీకెండ్ అనే వారపత్రికలోని ఓ ఆర్టికల్ ఈ నవలకి ముగింపుగా చక్కగా కలుస్తుందని అనిపించింది. మెహ్రాన్ కరీమీ నసేరి 54 ఏళ్ళ ఇరానియన్ కాందిశీకుడు. ఫ్రెంచ్ ప్రభుత్వం అతనికి రాజకీయ పునరావాసాన్ని నిరాకరించడంతో ఆగస్ట్ 1998లో మెహ్రాన్, పేరిస్ నించి

టెహ్రాన్‌కి వెళ్ళడానికి పేరిస్‌లోని ఛార్లెస్ డి గులా ఎయిర్‌పోర్టులో టెర్మినల్ ఒన్‌లోని డిపార్చర్ లాంజ్‌కి టికెట్‌తో చేరుకున్నాడు. అక్కడ అతను వింతగా, అసాధారణంగా చిక్కుపడ్డాడు.

ఇరాన్ అతనికి దేశబహిష్కరణ శిక్షని విధించి, ఇరానియన్ పాస్‌పోర్ట్ రద్దు చేసిందని తెలిసి అతన్ని టెహ్రాన్ వెళ్ళే విమానాన్ని ఎక్కనివ్వలేదు. రాజకీయ పునరావాసం తిరస్కరించబడటంతో ఎయిర్‌పోర్ట్‌ని వదిలి మళ్ళీ పేరిస్ నగరంలోకి వెనక్కి వెళ్ళే అవకాశం కూడా కోల్పోయాడు. దాంతో అతను ప్రపంచంలోని ఏ దేశపౌరుడు కాని వ్యక్తిగా చిత్రమైన పరిస్థితిలో చిక్కుకున్నాడు. ఏ విమానం ఎక్కి ఏ దేశానికీ వెళ్ళలేడు. విమానాశ్రయం వదిలి బయటకీ వెళ్ళలేడు. దాంతో ఎయిర్‌పోర్ట్‌లోని డిపార్చర్ లాంజ్‌లోని బాత్‌రూమ్‌లని వినియోగిస్తూ ప్రయాణీకులు తినగా విడిచిపెట్టే ఆహారాన్ని తింటూ జీవించసాగాడు. ఈ నవలకి అది ఆసక్తికరమైన ముగింపు అని స్ఫురించింది. ఈ నవల అచ్చయ్యే నాటికి మెహ్రాన్ ఇంకా డిగులా ఎయిర్ పోర్ట్‌లోనే జీవిస్తున్నాడు.

జులై 2006లో అనారోగ్యం వల్ల అతన్ని పేరిస్‌లోని హాస్పిటల్‌కి తరలించారు. 'ది టెర్మినల్ మేన్' అనే అతని ఆటోబయోగ్రఫీ 2004లో వెలువడింది. దాని ఆధారంగా అదే సంవత్సరంలో టామ్ హేంక్ హీరోగా నటించిన 'ది టెర్మినల్' అనే హాలీవుడ్ సినిమా కూడా వచ్చింది. హాలీవుడ్ కన్నా ముందే దీన్ని నేను ముడిపదార్ధంగా తీసుకున్నాను.

**సంక్షిప్తంగా కథ:** భారతదేశాన్ని పదకొండేళ్ళపాటు ప్రధానమంత్రిగా పాలించిన ధనంజయ తర్వాతి ఎన్నికల్లో ఓడిపోయాడు. కారణం ధనంజయ, అతని కొడుకు సుమన్ చేసిన అవినీతి పనులు. ధనంజయ పదవిలో ఉండగా స్విస్ బేంకుల్లోకి కోట్లాది డాలర్లని అవినీతిద్వారా చేరవేసాడు. ఆ నేరాల మీద ధనంజయుని అరెస్ట్ చేసారు. ఇండియాలో ఓ సామాన్య జేబు దొంగో, వీధి రౌడీనో ముద్దాయిగా అరెస్ట్ చేయబడితే న్యాయప్రక్రియ ఎలా జరుగుతుందో అలా రాజకీయ నేతల విషయంలో, డబ్బున్న వ్యాపారస్థుల విషయంలో, ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్నవారి విషయంలో జరగదు అన్నది మనం చూస్తున్న వాస్తవం. వీరు అందరిలా సామాన్యపౌరులు కారు. ప్రత్యేక పౌరులు. అలాకాక భారత మాజీ ప్రధానిని కూడా సామాన్య పౌరుడిలా విచారించి, ఎలాంటి ప్రమేయాలు, ప్రలోభాలు లేకుండా విచారణ జరిగితే? ఈ ప్రశ్నకి జవాబు ఈ నవల్లోని ప్రధానాంశం.

పోలీస్‌లకి లొంగిపోయిన మాజీ ప్రధాని ధనంజయుని సాధారణ జేబుదొంగలతోపాటు సెల్‌లో బంధిస్తారు. ఆ నాడు, నేడు కూడా ఈ ప్రత్యేక పౌరులు అరెస్ట్ అవగానే జైలు సెల్‌లో ఉండటాన్ని తప్పించుకోడానికి అనారోగ్యం కారణంగా చూపించి కార్పొరేట్ హాస్పిటల్‌లో చేరడం మనం దినపత్రికల్లో చదువుతున్నాం. ఈ నవల్లో ధనంజయ కూడా తన రోగాలని బట్టి ప్రత్యేక చికిత్స, ఆహారం కావాలని కోరితే ఎస్పై ఓ సాధారణ దొంగకి చెప్పే జవాబే చెప్తాడు.

"ఇలాంటి రోగాలు ఉన్న వాళ్ళు ఇండియా జైళ్ళలో లక్షలమంది ఉన్నారు. వారిని ఎలా ట్రీట్ చేస్తామో మిమ్మల్నీ అలాగే ట్రీట్ చేస్తాం."

దీనికి కారణం ధనంజయ స్థానంలో వచ్చిన నిజాయితీపరుడు, కూడబెట్టి ఇవ్వడానికి కుటుంబ సభ్యులు ఎవరూ లేని నూతన ప్రధానమంత్రి సిన్హా. ధనంజయ కేసు విషయంలో సిన్హా అని న్యాయవ్యవస్థలకి స్వయంప్రతిపత్తి ఇవ్వడంతో, ప్రభుత్వ యంత్రాంగంలోని ఎవరూ ఎలాంటి ప్రలోభాలకి, వత్తిళ్ళకి, లంచాలకి లొంగకుండా నియమాల ప్రకారం ధనంజయుని న్యాయవిచారణ చేస్తారు. బదులుగా ధనంజయ దేశాన్ని, న్యాయవ్యవస్థని కిరాతకంగా భయపెట్టి బలవంతంగా తను నిర్దోషి అనే తీర్పు వచ్చేలా చేస్తాడు ఇందుకు విదేశీ ఉగ్రవాదులని కిరాయికి తీసుకుంటాడు. ఐతే అంతిమ విజయం సిన్హాదే ధనంజయ భారదేశ పౌరసత్వం పాస్‌పోర్ట్ కోల్పోయి, పేరిస్‌లోని డి గులా ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ ఒన్‌లో, డిపార్చర్ లాంజ్‌లో మెహ్రాన్‌లా బిచ్చగాడి జీవితం గడుపుతాడు. మన దేశ అవినీతి పౌరులకి వేయాల్సిన శిక్ష ఇది.

2000 జనవరిలో లిపి పబ్లికేషన్స్ ద్వారా ఈ నవల వెలువడింది. 232 పేజీలు. వెల 50రూ. కన్నడంలో కూడా పుస్తకంగా వెలువడింది. తెలుగు నవల చాలా వేగంగా అమ్ముడైంది. మలి ముద్రణ వెలువడలేదు.

2000 - 2017. ఈ పదిహేడేళ్ళల్లో పి.వి.నరసింహారావుది చాలా చిన్న అవినీతిగా అనిపిస్తోంది. ఆ తర్వాత కోటానుకోట్ల భారతపౌరుల ధనాన్ని బాహాటంగా కైంకర్యం చేసే వారి సంఖ్య పెరిగింది. వారిని శిక్షించే చురుకైన వ్యవస్థ లేకుండాపోయింది. ఇలాంటి కేసులకి ప్రత్యేక కోర్టులు పెట్టినా విచారణకి చాలా ఆలస్యం జరుగుతోంది. దీనికి కారణం ఐ.కె గుజ్రాల్, వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్ ఉరఫ్ సోనియాగాంధీ... ఇలా ఎవరు ప్రధానమంత్రి పదవిలో ఉన్నా అవినీతిని పెంపొందించే చర్యలు తీసుకున్నారు తప్ప అరికట్టడాన్ని అజెండాలాగా చేసుకోలేదు. లంచాలు ఇచ్చే ప్రజలనే నేరస్థులుగా అరెస్ట్ చేయాలని, లంచం తీసుకునే అధికారులని అరెస్ట్ చేయడానికి ముందుగా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలనే నరేంద్ర మోడి కొత్తగా ప్రవేశపెట్టిన బిల్ ప్రస్తుతం పార్లమెంట్‌లో ఉంది. అది పాసైతే ఎలక్ట్రిసిటీ, వాటర్ కనెక్షన్‌కి రేషన్ కార్డ్‌కి, పట్టాకి, పాస్‌పోర్ట్‌కి విధి లేక లంచాలని చెల్లించే భారత ప్రజలంతా నేరస్థులై జైలుపాలవుతారు. అధికారులు అక్రమార్జనని కొనసాగిస్తూ, దాన్లోంచి మంత్రుల భాగాన్ని వారికి అందచేస్తూ అధికారంలో కొనసాగుతూనే ఉంటారు. అది లంచగొండితనాన్ని, అవినీతిని చట్టం చేయడమే.

2000తో పోలిస్తే అవినీతి, లంచగొండితనం నేడు వ్యవస్థీకృతం అయ్యాయి. ప్రభుత్వ వ్యవస్థకన్నా ఈ వ్యవస్థ చాలాబలంగా నిలదొక్కుకుంది. మన న్యాయవ్యవస్థ మీద కూడా రాజకీయ ప్రభావ నీడలు పడ్డాయి. అదీ వారి కబంధ హస్తాల్లోకి వెళ్ళిపోయింది. తాజా ఉదాహరణ జయలలిత కేసులో మొదటి తీర్పు వెలువడటానికి జరిగిన జాప్యం. దానిమీద అపీల్‌లో హైకోర్ట్ ఇచ్చిన తప్పు తీర్పుని సుప్రీం కోర్ట్ సరిదిద్దడం. ఆ తీర్పు ఇచ్చిన జస్టిస్ మీద అనేక అనుమానాలు కూడా ఉన్నాయి.

జైలు శిక్ష అనుభవించే శశికళ బయట షాపింగ్ చేసిన ఋజువులు సోషల్ మీడియాలో వెలువడ్డా మన న్యాయవ్యవస్థ దాన్ని తీవ్రంగా పరిగణించలేదు. సుమోటోగా తీసుకుని, విచారించి, జైల్‌నించి తప్పించుకునే నేరస్థుడికి విధించే శిక్షని ఆమెకి, అందుకు సహకరించిన వారికి విధించలేదు. కోర్ట్‌లో తమకి దాఖలైన కేసుల విషయంలోనే కాక ఇలాంటి వాటివల్ల కూడా న్యాయవ్యవస్థ దేశానికి న్యాయం చేయాలి.

కేవలం రాజకీయ నేపథ్యంతోనే మరో నవలని మొదలెట్టి సగంపైనే రాసాను. నాకు పరిచయం ఉన్న వారపత్రికల ఎడిటర్లలో కూడా అవినీతి ప్రవేశించడంతో సీరియల్స్ రాయడం మానేసి చాలాకాలమైంది. 2018లో అది డైరెక్ట్ నవలగా ప్రచురించబడుతుంది.

చివరగా నన్ను కమర్షియల్ రైటర్‌గా ముద్దుగా పిలిచే వాళ్ళు భూస్వాములు, పెట్టుబడిదారుల మీద రాసిన నవలలు, కవితలు, కథలు వల్ల శ్రామికులకి ఏంలాభం చేకూరిందో, ఈ నవల కూడా దేశరాజకీయాల్లో అలాంటి మార్పునే తెచ్చింది శూన్యం. పూజ్యం.

కొసమెరుపు. ఈ నవలకి సగం ఎడ్వాన్స్ ఇచ్చిన సుప్రభాతం పక్షపత్రిక యజమాని మాన్యశ్రీ రత్తయ్య మిగిలిన సగభాగం పారితోషికాన్ని ఎగ్గొట్టారు. అదే సమయంలో సుప్రభాతం నుంచి తప్పుకున్న ఎబికెగారు వ్యక్తిగతంగా నాకు తన విచారాన్ని తెలియచేసారు.

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి